జాతీయ రహదారి విస్తరణ పనుల పరిశీలన



జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను గురువారం నేషనల్ హైవే డీఈ రామకృష్ణ, స్థానిక కార్పొరేటర్ పుష్ప, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 4 లైన్‌లతో మెయిన్ రోడ్డును గ్రిల్‌తో, అలాగే ఇరువైపులా 30 ఫీట్‌ల సర్వీస్ రోడ్డు, 6 ఫీట్‌ల ఫుట్‌పాత్‌తో కూడిన రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక పూజలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యలో రామమందిరానికి పునఃప్రతిష్ఠ చేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా పలువురు హెచ్‌సీయూ విద్యార్థుల ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని వివేకానంద స్టూడెంట్స్ అమెనిటీస్ సెంటర్ వద్ద హనుమాన్‌చాలీసా, శ్రీరామ శృతిని సామూహికంగా చదివారు.

స్టూడెంట్ ట్రైబ్ గ్రాండ్ ఫినాలే

మాదాపూర్: ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభతో సందర్శకులను ఆకట్టుకున్నారు. గురువారం శిల్పకళావేదికలో తెలుగు రాష్ట్రాల ఇంజనీరింగ్ విద్యార్థులకు స్టూడెంట్ ట్రైబ్ గ్రాండ్ ఫినాలే ఆఫ్ సెయింట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిభావంతులైన యువతను ఒకే వేదికపై చేర్చి న్యాయనిర్ణేతల ద్వారా విజేతలను ఎంపిక చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. న్యాయనిర్ణేతలుగా సింగర్ హేమచంద్ర, సంధ్యారాజు, అరుణబిక్షు, శాండిల్య పిసపాటి, శ్రీచరణ్, హర్షితలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ ట్రైబ్ వ్యవస్థాపకుడు శ్రీచరణ్ లక్కరాజు, సినీనిర్మాత అల్లుఅరవింద్, సినీనటుడు నాగచైతన్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

నిజాంపేట్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 14,12వ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మేయర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మంజీర వాటర్ ట్యాంక్ ఎదురుగా కెపీఎస్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్, వెంకటరాయనగర్ కాలనీ నుండి ఇందిరమ్మ కాలనీ ఫేజ్-1 వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్-3లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్, సాయినాథ్ నగర్ కాలనీ శివాలయం వద్ద బాక్స్ డ్రెయిన్ తదితరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పనులలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, రాజేశ్వరి చౌదరి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్, ఎన్‌ఎంసీ పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరా, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వడ్ల నాగేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి కృషి చేద్దాం

పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పొగాకు రహిత సమాజానికి కృషి చేద్దామని పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పరిసర ప్రాంతాలలో పొగాకు నియంత్రణపై ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పొగాకు వాడకం ద్వారా కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. పొగాకు వాడకం విచ్చలవిడిగా పెరిగిందన్నారు. యువత బీడీ, సిగరెట్, జర్దా, గుట్కా పాన్ మసాలాలు తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే వివిధ రకాల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను బహిరంగ ప్రదేశంలో తీసుకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్.. 11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 8 మందికి రూ. 1500 జరిమాన, అదేవిధంగా మరో ముగ్గురికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఆరోగ్య సేవలకు సొంత భవనాలేవీ ?

పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాలు జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో..

రాయదుర్గంలోని జీహెచ్‌ఎంసీ భవనంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఇదే





మధురానగర్‌లోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లోనే కొనసాగుతున్న బస్తీ దవాఖానా ఇదే



ఖాజాగూడలో జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

రాయదుర్గం: ప్రజలకు నిత్యం సేవలందించే పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాలకే సొంత భవనాలు లేకుండాపోయాయి. గచ్చిబౌలి డివిజన్‌లో ప్రజలకు మరింత చేరువలోకి వైద్య సేవలను తీసుకురావడానికి ఆస్పత్రులను ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రుల్లో పేద, బడుగు, కార్మిక వర్గాలు వైద్య సేవలు పొందుతున్నారు. అయితే వీటికి సొంత భవనాలు లేకుండా పోయాయి.

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాయదుర్గంలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం నిర్వహించే భవనంలో ఏర్పాటు చేశారు.
- మధురానగర్, గౌలిదొడ్డి, గోపన్‌పల్లిలో బస్తీ దవాఖానాలను జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్నారు. వీటికి సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. స్థలం కూడా కేటాయించడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రాలు సైతం

చిన్నారులకు విద్యాబుద్ధులు, పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలు కూడా జీహెచ్‌ఎంసీ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. డివిజన్ మొత్తంలో ఒక్క మధురానగర్‌లో మాత్రం కొమిరిశెట్టి ఫౌండేషన్ ద్వారా ఐదేళ్ల క్రితం అప్పటి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఈ అంగన్‌వాడీ కేంద్రానికి భవన నిర్మాణం చేయించి ఇచ్చారు. అదొక్కటే తప్ప మిగతా వాటిలో కొన్ని ప్రభుత్వ స్కూళ్లలోని తరగతి గదుల్లో నిర్వహిస్తుండగా మిగతావన్నీ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో కొనసాగిస్తున్నారు.

‘సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్ టాక్ నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ‘హౌ టు ఎవైడ్ కన్సల్టింగ్ ఏ సైక్రియాటిస్ట్’ పేరిట మౌంట్‌అబూలోని గ్లోబల్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ డాక్టర్ నిఖిల్‌పటేల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

27న నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్య నిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులో భాగంగా ఈ నెల 27 న నిధి ఆప్ కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...3 కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. బొల్లారం రోడ్డు జయప్రకాష్ నారాయణ నగర్ ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్, పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని కిర్బీ బిల్డింగ్ సిస్టమ్ అండ్ స్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జహీరాబాద్ అల్గోల్ రోడ్డు లో ఫ్రీ- గెరియ కన్సర్వ అల్లనా ప్రైవేట్ లిమిటెడ్‌లో నిర్వహించే ఈ మూడు కేంద్రాలలో భవిష్య నిధి సమస్యలు ఉన్న వారు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

హెచ్‌సీయూలో రక్తదాన శిబిరం



ఏబీవీపీ, స్టూడెంట్స్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించిన దృశ్యం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రక్తదాన శిబిరం విజయవంతమైంది.గచ్చిబౌలి హెచ్‌సీయూ క్యాంపస్ సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలో గురువారం స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ, స్టూడెంట్స్ ఫర్ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ శీల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు డి.అనిల్‌కుమార్, కార్యదర్శి ఆయూష్‌కుమార్‌సింగ్, ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఎస్ తెలంగాణ కోకన్వీనర్ అక్షయ్, హెచ్‌సీయూ కన్వీనర్ వినయ్‌త్రిపాఠి, బీవీపీ నాయకులు సందీప్, మహేష్, యశస్వి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధాన నిర్ణయాల అమలులో ప్రజా పరిపాలనాశాస్త్రం కీలకం



సదస్సులో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ వీసీ ప్రొ.రహమతుల్లా

రాయదుర్గం: ప్రజా పరిపాలనాశాస్త్రం ఏదైనా విధాన ప్రయత్నానికి ప్రధానమైందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్‌ఎం రహమతుల్లా పేర్కొన్నారు. మనూలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పాత్ర’పై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధాన నిర్ణయాల అమలులో ఈ శాస్త్రం కీలకమన్నారు. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ జి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ‘మనూ’ ఓఎస్‌డీ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మాట్లాడుతూ స్వీయ పరిపాలన అవసరమన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ , విభాగాధిపతి ప్రొఫెసర్ సయ్యద్ నజీవుల్లా, సదస్సు కో కన్వీనర్ డాక్టర్ రజా ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పశు సంక్రాంతి’కి సర్వం సిద్ధం

- నేడు నార్సింగిలో పశువుల జాతర
- నిజాం కాలంలో మొదలైన పశువుల సంత
- ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్
- జాతరకు ఆవులు, గేదెలను తరలించిన రైతులు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్

మణికొండ: హైదరాబాద్ నగర శివారు నార్సింగిలో ఏటా సందడిగా జరిగే పశుసంక్రాంతి జాతరను శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. నిజాం కాలంలో మొదలైన ఒరవడి నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. పంటలన్నీ ఇంటికి చేరి అవి అమ్మగా వచ్చిన డబ్బుతో రైతులు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకొంటారని అందరికీ తెలుసు. మిగిలిన డబ్బుతో తమ పంటలకు తోడుగా పాడిని (పశువులు) కొనుగోలు చేసే సంస్కృతికి చిహ్నంగా నిలిచేదే నార్సింగి పశుసంక్రాంతి. ఒకప్పుడు నార్సింగి కుగ్రామంగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఈ సంస్కృతి ప్రస్తుతం మున్సిపాలిటీగా అవతరించి ఎటు చూసినా ఆకాశాన్నంటే టవర్‌లు, అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కన్వెన్షన్‌లు, ఔటర్ రింగ్ రోడ్డుతో కొత్త హైటెక్ నగరంగా అవతరించినా కొనసాగుతుండటం అందరినీ అబ్బురపరుస్తుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ తరువాత వచ్చే రెండవ శుక్రవారం పశు సంక్రాంతిగా నిర్వహిస్తారు.

- గుజరాత్, హరియాణా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది గేదెలు, ఆవులను వ్యాపారులు, రైతులు ఇక్కడకు తెచ్చి క్రయవిక్రయాలను నిర్వహిస్తుంటారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పశుసంక్రాంతిని ఈ సంవత్సరం శుక్రవారం నిర్వహించేందుకు మార్కెట్ కమిటీ పాలక కమిటీ ఏర్పాట్లు చేసింది.
- ప్రతి సంవత్సరం నార్సింగి పశు సంక్రాంతికి వచ్చే గేదెలు, ఆవులు రికార్డు ధరలు పలికి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఈసారి పంటలు బాగా పండటం, వరి పంట అధిక దిగుబడి రావటంతో రైతుల వద్ద డబ్బు ఉందని, పంటలకు తోడుగా పశువులను పెంచుకోవాలనే దిశగా రైతులు ఆలోచన చేస్తున్నారని, దాంతో శుక్రవారం జరిగే సంతలో భారీగానే అమ్మకాలు జరిగే అవకాశం ఉంటుందని పశు వ్యాపారులు పేర్కొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్..

నార్సింగిలో పశుసంక్రాంతికి వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే వందలాది గేదెలు, ఆవులు తరలివచ్చాయి. మరిన్ని వస్తున్నాయని, శుక్రవారం ఉదయం వరకు అవి ఇక్కడకు చేరుకుంటాయని మార్కెట్ కమిటీ వర్గాలు పేర్కొన్నాయి. వాటిని అమ్ముకునేందుకు వీలుగా మార్కెట్ కమిటీ ప్రాంగణాన్ని శుభ్రంగా తీర్చిదిద్దటంతో పాటు టెంట్‌లను ఏర్పాటు చేశారు. పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్ గురువారం పర్యవేక్షించారు. పశుసంక్రాంతికి వచ్చిన గేదెలు, ఆవులను పరిశీలించి వాటి విశిష్టతను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు.

- పశుసంక్రాంతిని శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, రైతులకు మొదటి సారి భోజనాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఆవులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: మయూరినగర్, గోకరాజు రంగరాజు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గోకరాజు కళాశాల రోడ్డు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓల్డేజ్ హోం, మయూరినగర్, ఎస్‌బీఐ బ్యాంకు రోడ్డు, విజేత సూపర్‌మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- భిక్షపతి ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు కైలాష్‌నగర్, టెక్నో అపార్ట్‌మెంట్స్, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4,5,6, శ్రీదేవి థియేటర్ ఎదురుగా ఉన్న ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హఫీజ్‌పేట్, మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో..

- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు జనప్రియనగర్ ఫేజ్ 1,2,3,4,5, జనప్రియనగర్, ఆల్విన్ కాలనీ ఎక్స్ రోడ్డు, కుమ్మరి బస్తీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, సితార గ్రాండ్ ఏరియా, టూగెదర్ మెంట్స్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.
- మాధవనగర్, కళ్యాణ గార్డెన్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, మాధవనగర్, అంబేద్కర్‌నగర్, నందినగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా

మియాపూర్: మియాపూర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీను పరిష్కరిస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. గురువారం డ్రైనేజీ మరమ్మతు పనులను జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. జలమండలి మేనేజర్ సునీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగయ్య, నాయకులు మహేందర్‌ముదిరాజ్, వజీర్ తదితరులున్నారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి



కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి భవిత సెంటర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కట్లు అందజేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను తరిమి కొట్టవచ్చని నేతాజీ నమ్మారన్నారు. కార్యక్రమంలో భవిత సెంటర్ టీచర్లు వెంకటరమణమ్మ, అబీదా, అసోసియేషన్ ప్రతినిధులు ఉమా చంద్రశేఖర్, వాణి సాంబశివరావు, పాలం శ్రీను, కృష్ణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నాలాల విస్తరణతో ముంపు సమస్య పరిష్కారం



నల్లగండ్ల- భెల్ చౌరస్తా వరకు ఉన్న నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్‌ఎన్‌డీపీ విభాగం సీఈ కోటేశ్వరరావు

శేరిలింగంపల్లి: నాలాల విస్తరణతో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. నల్లగండ్ల చెరువు అలుగు నుంచి భెల్ చౌరస్తా వరకు ఉన్న నాలాను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్‌ఎన్‌డీపీ విభాగం సీఈ కోటేశ్వరరావులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నాటికి నాలాల విస్తరణ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈలు దుర్గా ప్రసాద్, కేవీఎస్ రాజు, డీఈ ఆనంద్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79.58 కోట్ల వ్యయంతో నాలాల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. గురువారం జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఎస్‌ఎన్‌డీపీ విభాగం, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. నాలాల విస్తరణతో ముంపు ప్రాంతాలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలు డివిజన్లలో హెచ్-సిటీ, ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్-2లో భాగంగా మంజూరైన నాలాల విస్తరణ పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్-2 మంజూరైన నాలాల విస్తరణ పనులు ఇవే..

- గఫూర్ నగర్‌కాలనీలో జంక్షన్ నుంచి దుర్గం చెరువు వరకు రూ.11.55 కోట్లతో ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం
- జనార్దన్‌హిల్స్ కాలనీ నుంచి యూరో కిడ్స్ స్కూల్ వరకు రూ.13.86 కోట్ల వరదనీటి కాలువ
- గురునాథం చెరువు నుంచి పటేల్ చెరువు వరకు రూ.6.80 కోట్లతో ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం
- పటేల్ చెరువు నుంచి గంగారం చెరువు వరకు రూ.18.92 కోట్లతో ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం
- నల్లగండ్ల చెరువు నుంచి బీహెచ్‌ఈఎల్ కూడలి గ్యాస్ గోడౌన్ నాలా వరకు రూ.28.45 కోట్లతో ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ పనులు చేపట్టనున్నట్లు గాంధీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ సీఈ కోటేశ్వరరావు, ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, డీఈలు రాజు, శశిధర్, ఏఈ వెంకటేష్, మహేందర్‌రెడ్డి, యుగంధర్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈదుర్గా ప్రసాద్, ఈఈ కెవిఎస్‌రాజు, డీఈ ఆనంద్, దుర్గాప్రసాద్, విశాలాక్షి, శ్రీదేవి, ఏఈలు ప్రశాంత్, ప్రతాప్, జగదీష్, రషీద్, సంతోష్‌రెడ్డి, సంతోష్, డీఈ స్ట్రీట్ లైట్స్ కవిత, అధికారులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో సమ్మక్క సారలమ్మ జాతర

ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



గుట్టపై బండలకు రంగులు వేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానసాహిల్స్‌లోని సమ్మక్క సారలమ్మ గుట్ట జాతరకు ముస్తాబవుతోంది. ఫిబ్రవరి 12, 13వ తేదీల్లో ఎదురు పున్నమి సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహించనున్నారు. ఇందుకోసం అవసరమైన పనులను ప్రారంభించారు. సమ్మక్క సారలమ్మ గుట్టలకు రంగులు వేసి గద్దెలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. గుట్టపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివస్తారు. జాతర నిర్వాహకులు నేరేడు శ్రీరాములు ముదిరాజ్, పూజారి నిరుడు చంద్రకుమార్ ముదిరాజ్‌లు భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధిలో అగ్రగామిగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.గురువారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో 6 కోట్ల 82 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు పనులకు స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం లాలాబావి కాలనీలో నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో దశాబ్ద కాలంగా మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు.

ప్రజాపాలన వార్డు సభలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో, మున్సిపల్ విలీన గ్రామాలలో గురువారం ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. 8వార్డులో జరిగిన సభలో కౌన్సిలర్ భరత్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కౌన్సిలర్ భరత్ కోరారు. కర్దనూర్‌లో జరిగిన సభలో ప్రత్యేక అధికారి అంబిక ,స్థానిక నేతలు పాల్గొన్నారు.